తాడు. శుభముహూర్తాన జాంబవతి, సత్యభామ ఇద్దరితో శ్రీకృష్ణుడికి వివాహం జరుగుతుంది.

ఈ వివాహానికి తరలి వచ్చిన దేవతలు, మునులు శ్రీకృష్ణుణ్ని స్తుతించి 'స్వామీ! మీరు సమర్థులు కనుక మీ మీద వచ్చిన అపనిందను పోగొట్టుకోగలిగారు. మరి, మాలాంటి సామాన్యుల గతి ఏమని' ప్రార్థించారు. అప్పుడు శ్రీ కృష్ణుడు 'ఎవరైతే భాద్రపద శుద్ధ చతుర్థి నాడు యథావిధిగా వినాయకుని పూజించి ఈ శమంతకమణి కథను చదివి, విని అక్షతలు తలపై చల్లుకుంటారో వారికి చంద్రుణ్ని చూసినా ఎలాంటి నిందలు కలుగవ'ని అభయమిచ్చాడు. దాంతో అందరూ సంతోషిస్తారు.

నాటినుంచి ప్రతి సంవత్సరమూ భాద్రపద శుద్ధ చతుర్థినాడు తమ శక్తికి తగ్గట్టుగా గణపతిని పూజించి, తాము సుఖంగా జీవిస్తున్నామని సూతుడు శౌనకాది మహామునులకు వినిపించి, అక్కడే ఉన్న ధర్మరాజుతో 'నువ్వు కూడా ఇదే ప్రకారంగా గణపతిని పూజిస్తే తప్పక నీకు జయం కలుగుతుంది. తిరిగి నీ రాజ్యం నీకు దక్కుతుంది. దీన్ని ఎంతోమంది భక్తితో ఆచరించారు. ఈ వ్రత ప్రభావంతో దమయంతి నలుని, శ్రీకృష్ణుడు జాంబవతిని పొందారు. ఇంద్రుడు వృత్రాసురుణ్ని సంహరించాడు. సకల విజయ ప్రదాత అయిన వినాయకుడిని ప్రసన్నం చేసుకోవడానికి అందరూ ఈ వ్రతాన్ని యథాశక్తి చేసుకోవాలి' అని చెప్పాడు. అప్పుడు ధర్మరాజు విధి ప్రకారంగా గణపతిని పూజించి సకల ఐశ్వర్యాలనూ, రాజ్యాన్ని పొంది సుఖంగా జీవించాడు.

ఇది శ్రీ స్కాంద పురాణంలో భాగమైన
ఉమామహేశ్వర
సంవాదంలోని వినాయక వ్రతకల్పం.

**కథ ప్రారంభానికి ముందు చేతుల్లో పట్టుకున్న అక్షతలను**
**భక్తులు తమ శిరస్సుపై ధరించాలి.**

**ఉద్వాపన:** యజ్ఞేన యజ్ఞ మయజంత దేవాః
తాని ధర్మాణి ప్రథమాన్యాసన్
తేహ నాకం మహిమాన స్సచంతే
యత్ర పూర్వే సాధ్యాస్సంతి దేవాః
(దేవుని ఈశాన్య దిశగా కొంచెం కదపండి!)

సర్వేజనాస్సుఖినో భవంతు
ఓం శాంతిః ఓం శాంతిః ఓం శాంతిః

***

## మంగళ హారతి

శ్రీ శంభు తనయునకు సిద్ధిగణనాథునకును
వాసిగల దేవతా వంద్యునకును
జయమంగళం నిత్య శుభమంగళం॥
ఆ సరస విద్యలకు ఆదిగురువైనట్టి
భూసురోత్తమ లోకపూజ్యునకును
జయమంగళం నిత్య శుభమంగళం॥



# మట్టి గణపతే శ్రేష్ఠం!



ఆకాశం నుంచి వాయువు, వాయువు నుంచి అగ్ని, అగ్ని నుంచి నీరు ఏర్పడ్డాయి. నీటి నుంచి భూమి ఏర్పడింది. భూమి జడపదార్థం. నీరు ప్రాణాధార శక్తి. ఈ రెండు పదార్థాలు కలవటం వల్ల అంటే.. జడపదార్థమైన భూమి చైతన్యం కలిగిన నీళ్లతో చేరినప్పుడు ప్రాణ శక్తి కలుగుతుంది. తద్వారా ఆహార పదార్థాలు, ఓషధులను మనకు అందిస్తుంది. ఈ విధంగా ప్రాణాధార, జడశక్తుల కలయికతో సృష్టి సాగుతున్నదని చెప్పడానికి సంకేతంగా గణపతి విగ్రహాన్ని మట్టి, నీరు కలిపి తయారుచేసి, ఆ మృణ్మయ మూర్తిని పూజించే విధానం ఏర్పడింది. మట్టి గణపతిని పూజించటంలో యోగశాస్త్ర రహస్యాలు కూడా ఉన్నాయి. మానవ శరీరంలో ఉండే షట్చక్రాల్లో మొదటిది మూలాధార చక్రం. ఇది వెన్నుపూస ప్రారంభంలో ఉంటుంది. యోగ శాస్త్రం ప్రకారం మూలాధార చక్రానికి అధిష్ఠాన దేవత గణపతి. మూలాధారం పృథ్వీ తత్త్వం కలిగి ఉంటుంది. పృథ్వి అంటే భూమి. కాబట్టి, భూమికి సంకేతంగా మట్టితో విగ్రహం చేసి, మూలాధారానికి అధిదేవత అయిన గణపతిని అర్చించాలి. దీనివల్ల గణపతి అనుగ్రహం సత్వరమే కలుగుతుంది.

# • చిన్న విగ్రహం ఎందుకు?

**■ ధర్మసందేహం**



వినాయక మంటపంలో గణపతి పెద్ద విగ్రహంతోపాటు చిన్న విగ్రహం కూడా పెడతారు ఎందుకు?

వక్ర తుండ మహాకాయ
కోటి సూర్య సమప్రభా।
నిర్విఘ్నం కురుమే దేవ
సర్వ కార్యేషు సర్వదా॥

అని రోజూ మనం గణపతిని ప్రార్థిస్తాం. భారీ శరీరంతో కోటి సూర్యకాంతులను ప్రసరింపజేస్తూ, వంకర తిరిగిన తొండంతో అనుగ్రహించే ఓ దైవమా.. మేం చేసే పనులలో ఎలాంటి ఆటంకాలూ రాకుండా చూడమని వేడుకుంటూ వినాయకుణ్ని స్తుతించే శ్లోకం ఇది. గణాధిపతిని కేవలం వినాయక చవితి నాడే కాకుండా ప్రతి రోజూ షోడశ ఉపచారాలతో విధిగా పూజిస్తుంటారు. నిత్యపూజల్లో, శుభకార్యాల్లో మొదటి పూజ పార్వతీ తనయుడికే చెల్లుతుంది. ఇక వినాయక చవితి సందర్భంగా వీధివీధినా మంటపాలు నెలకొల్పి నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తారు. వినాయకుడికి భారీ విగ్రహాలను ఏర్పాటుచేస్తారు. భక్తులంతా ఆ వేడుకల్లో పాలుపంచుకుంటారు. పూజలో భాగంగా వినాయక ఉత్సవమూర్తిని విధిగా షోడశ ఉపచారాలతో అర్చించి అలంకరించాల్సి ఉంటుంది. ప్రతిరోజూ మంటపంలో ఉన్న భారీ విగ్రహాన్ని పూజించడానికి సౌకర్యంగా ఉండదు. కాబట్టి, ప్రత్యామ్నాయంగా నిత్యపూజ నిర్వహించడానికి వీలుగా ఒక ఉపమూర్తిని (గణపతి చిన్న విగ్రహాన్ని) కూడా మంటపంలో పెట్టి, ఆవాహనం చేసి పూజించే సంప్రదాయం ఏర్పడింది. ఇది లోకాచారమే కానీ, చిన్న విగ్రహం తప్పనిసరిగా కొలువుదీర్చాలనీ, దానికే పూజలు నిర్వహించాలనే దానికి శాస్త్ర ప్రమాణం లేదు. వినాయకుడి పూజలో భాగంగా పసుపు గణపతిని చేసి పూజించాలని శాస్త్రం చెబుతున్నది.